పల్లెల్లో అటకెక్కిన అభివృద్ధి

- గ్రామపంచాయతీలకు నిధుల కొరత
- నిలిచిన కేంద్ర ఆర్థిక సంఘం నిధులు
- తంటాలు పడుతున్న కార్యదర్శులు

పాల్వంచరూరల్: నిధుల కొరత గ్రామపంచాయతీలను వేధిస్తోంది. దీంతో పల్లెల్లో అభివృద్ధిలో పురోగతి లేక సతమతమతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో ఏడాదికాలంగా పంచాయతీల్లో ప్రగతి కుంటుపడింది. దీంతో పంచాయతీలో పనులు చేసేందుకు నిధులలేమితో ఇబ్బందిగా మారింది. కనీస వసతులు కల్పించడంలో అవస్థలు పడుతున్నారు. గ్రామపంచాయతీల సర్పంచ్‌ల పదవి ముగిసి ఏడాదైంది. ప్రత్యేకాధికారులు పాలన సాగుతోంది. పంచాయతీల్లో కనీసం కార్మికులకు జీతాలు చెల్లించే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

దీంతో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన గ్రామపంచాయతీల్లో ట్రాక్టర్ల కిస్తీలు కట్టలేని దుస్థితి నెలకొంది. మండలంలో 36 గ్రామపంచాయతీలు ఉండగా మూడు, నాలుగు గ్రామపంచాయతీల ఆర్థిక పరిస్థి తి బాగుంది. ఇంతకాలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులతోనే నెట్టుకొస్తున్నారు. ఏడాది నుంచి కేంద్రం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు నిలిపివేయడంతో పంచాయతీల పరిస్థితి దయనీయంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం వాటా అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిలిపివేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది అయినా పంచాయతీలకు నయాపైసా ఇవ్వలేదు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వ నిధులు సంవత్సరం నుంచి రాకపోవడంతో గ్రామాల్లో పనులు చేయలేక అధికారులు తంటాలు పడుతున్నారు. గత సర్పంచ్‌లు అప్పులు చేసి అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు. అవి ఇప్పటి వరకు రాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సూరారం వీధిలో పేరుకుపోయిన మట్టి కుప్పలు

బ్లీచింగ్, వీధి లైట్లకు ఇబ్బందులు...
నిధులలేమి కారణంగా వీధుల్లో బ్లీచింగ్ చల్లలేని, వీధి లైట్లు ఏర్పాటు చేయలే పరిస్థితి నెలకొంది. 34మంది గ్రామకార్యదర్శులు వెయ్యి మంది జనాభా కలిగిన పంచాయతీలో ఒక్కో కార్యదర్శి ఇప్పటికే రూ.1.50 లక్షల అప్పు చేసి పెట్టుబడి పెట్టారు. వెయ్యి మంది కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలో రూ.2 లక్షలపైన అప్పులు చేశారు. ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపే దిక్కులేదు.


తోగ్గూడెం గ్రామపంచాయతీ కార్యాలయం

నెల వారీ బిల్లులు కూడా ఇవ్వడం లేదు...
గ్రామపంచాయతీలో ప్రతీనెల పంచాయతీలో వీధిలైట్ల మరమ్మతులు, విద్యుత్ బిల్లులు, తాగునీటి పైపులైన్ మరమ్మతులు, ట్రాక్టర్ల కిస్తీలు, మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు తదితర పనులకు విధిగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే మండలంలో ఎక్కువ గ్రామపంచాయతీలో సాధారణ నిధులు రూ.పది వేలు కూడా లేకపోవడంతో బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

అవస్థలు పడుతున్నాం..


గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలో రూ.12లక్షల అభివృద్ధి పనులు చేయించాను. సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు పనులకు ఖర్చు చేసిన. కానీ ఇంతవరకు బిల్లులు రాలేదు. అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టిన.
– వాసం రుద్ర, మాజీ సర్పంచ్, ఉల్వనూరు

ఎంపీడీఓ కార్యాలయానికి తిరుగుతున్నా..


వీధుల్లో మట్టి పోసి, బోర్లు బాగు చేయించి, ట్రాక్టర్‌కు డీజిల్, వీధి లైట్ల మరమ్మతుల వంటి పనుల కోసం రూ.3.60 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. ఎంపీడీఓ ఆఫీసుకు ఎన్నిసార్లు తిరిగినా బిల్లులు ఇవ్వడం లేదు. అధికారులకు స్పందించాలి.
– నిమ్మల పద్మ, మాజీసర్పంచ్, బంద్రుగొండ

పారిశుద్ధ్య లోపం లేకుండా చూస్తున్నాం..


గ్రామపంచాయతీల్లో నిధుల కొరత ఉంది. కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు రాలేదు. ఉన్న నిధులతో ప్రాధాన్యతా క్రమంలో పనులు చేయిస్తున్నాం. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చూస్తున్నాం. ప్రజలు సహకరించాలి. పైఅధికారుల సూచనలు పాటిస్తున్నాం.
– విజయభాస్కరరెడ్డి, ఎంపీడీఓ

క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


పూజలో పాల్గొన్న భక్తులు

పాల్వంచ: పాత పాల్వంచలోరి శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. రెండోరోజు మంగళవారం దేవాలయంలో ప్రధాన పూజారి కందాల సింహాద్రి ఆనందకుమారాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలోని శ్రీపాండురంగ భజన మందిరాన్ని మంగళవారం బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ కె.సులోచన, అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికి శాలువతో సన్మానించారు.

మత్తు పదార్థాల వినియోగం నేరం


మాట్లాడుతున్న కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు: మత్తు పదార్థాల వినియోగం వల్ల అనేక దుష్ఫలితాలు సంభవిస్తాయని, వాటిని అక్రమంగా రవాణా చేయటం కూడా చట్టరీత్యా నేరం అని, దీనిని ప్రతీ విద్యార్థి గ్రహించాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. మంగళవారం ఇల్లెందు ఎస్టీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన న్యాయ చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రవాణా జరిగే సమయంలో తెలిసిన, తెలియని వ్యక్తుల వల్ల కూడా ఇలాంటి సంఘటనల్లో ఇరుక్కోవాల్సి వస్తుందన్నారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే వస్తువులు, బ్యాగులను ముట్టుకోరాదన్నారు. అనంతరం హాస్టల్ వంటశాలలను పరిశీలించారు. న్యాయమూర్తి వెంట బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కీర్తికార్తీక్, మోదుగు వీరేంద్రబాబు, వార్డెన్ భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాభివృద్ధి


మాట్లాడుతున్న ఎంఈఓ జుంకీలాల్

జూలూరుపాడు: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విద్యార్థులకు బోధించడం ద్వారా విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లలో లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం సాఫ్ట్‌వేర్ వినియోగంపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ ఉపాధ్యాయులకు మంగళవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ... అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ప్యానళ్లను ఏర్పాటు చేశామని, వాటిని సమర్థవంతంగా వినియోగించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు బి.సంపత్ కుమార్, బి.కృష్ణ, చంద్రశేఖర్, పటేల్, రమణమ్మ పాల్గొన్నారు.

ఘంటసాల పాటలు చిరస్మరణీయం

పాల్వంచ: గాన గాంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన పాటలు ఎప్పటికీ నిలిచిపోతాయని మెగా ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాసీం, శ్రీ వెంకటేశ్వర కళానాట్య మండలి అధ్యక్షుడు భాషా అన్నారు. మంగళవారం ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... ఘంటసాల పాటలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయన్నారు.

మూఢ నమ్మకాలను వీడాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుజాతనగర్: విద్యార్థులు మూఢ నమ్మకాలను వీడి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జనవిజ్ఞాన వేదిక ప్రత్యేక ఆహ్వానితులు కొల్లు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డార్విన్ పరిణామ క్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. మాట్లాడుతూ... విద్యార్థులు మూఢ నమ్మకాలు వీడి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని చెప్పారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కస్తూరి మాట్లాడుతూ... రంగురాళ్లు, విభూది, చేతబడులతో కొందరు మోసగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. డార్విన్ ప్రతిపాదించిన జీవ పరిణామ క్రమంలో మానవులు, జంతువులు మార్పు చెందుటకు కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టిందని చెప్పారు. అంతకు ముందు డార్విన్ జీవ పరిణామ క్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం సామాజిక భద్రత పథకాలను రూపొందిస్తోందని సెర్ప్ ఏపీఎం దుర్గారావు అన్నారు. మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో నాబార్డ్ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సభ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను, బ్యాంకు, స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుంటూ జీవన ప్రమాణ స్థాయిని పెంచుకోవాలన్నారు. దీనికోసం పంచసూత్రాలను ప్రతీ సభ్యురాలు అవగాహన చేసుకోవాలన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై ప్రయోజనాలను సమగ్రంగా వివరించారు. రిసోర్స్ పర్సన్ కృష్ణకుమారి, నాగమణి మాట్లాడుతూ.. పొదుపు సంఘాలలో సభ్యులుగా చేరి ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకున్న పలువురు మహిళల విజయగాథలను వివరించి చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ఫైనాన్షియల్ లిట్రసీ కౌన్సిలర్ నాగేశ్వరరావు, జగన్, సీసీ ఎర్రమళ్ల భూలక్ష్మి, మండల సమాఖ్య కార్యదర్శి సౌజన్య, గ్రామ సంఘం ప్రతినిధులు మానస, సైదమ్మ, దనలక్ష్మి, వీఏఓలు అరుణ, సురేష్, విజయలక్ష్మి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ కృష్ణకుమారి

స్థానిక ఎన్నికలకు పోలింగ్ బూత్‌లు ఖరారు

ఇల్లెందురూరల్: మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ బూత్‌లపై అధికారులు కసరత్తు పూర్తి చేశారు. మండలంలోని 16 ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానం కోసం ఎన్నికలు నిర్వహించేందుకు 93 పోలింగ్ బూత్‌లను ఎంపిక చేశారు. ఆయా బూత్‌లలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించి సిద్ధం చేశారు. ఈ మేరకు ఎంపిక చేసిన 93 పోలింగ్ బూత్‌ల వివరాలతో మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ బూత్‌ల ముసాయిదా వివరాలను మంగళవారం ప్రదర్శించారు. వీటిపై ఆయా గ్రామాల్లో రాజకీయ నాయకులు, ప్రజలు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎంపీడీఓ ఆఫీసులో ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి దినేష్

టేకులపల్లి: విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని టేకులపల్లి మండల వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకులంలో సులానగర్ ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు క్షయ, కుష్టు, చర్మ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడం ఆరోగ్యంగా ఉంటామని, అలాగే పిల్లలు ఆహారం తీసుకునే ముందు మరియు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. ప్రతీరోజు ఉదయం, రాత్రి నోటిని బ్రష్ చేసుకోవాలని తెలిపారు. రెండు పూటలా స్నానం చేయాలని, వదులుగా ఉన్న బట్టలు ధరించాలని, తడి బట్టలు ఉపయోగించరాదన్నారు. పరిశుభ్రత లోపించడం వల్ల చర్మ సంబంధిత అంటువ్యాధులు ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తాయని తద్వారా నిద్రలేమితో చదువుల్లో, ఆటల్లో వెనుకబడే అవకాశం ఉంటుందని చెప్పారు. ఒకరు వాడిన బెడ్ షీట్స్, టవల్స్, బట్టలు ఎట్టి పరిస్థితుల్లో మరొకరు వాడరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్, స్టాఫ్ నర్స్ రేష్మ, వైద్య సిబ్బంది సులోచన, చంద్రకళ, మజహరి పాల్గొన్నారు.

లక్కినేనికి పరామర్శ


ఇల్లెందు: టేకులపల్లి మండలం బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌ను బీఆర్‌ఎస్ నేతలు ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, దిండిగల రాజేందర్ పరామర్శించారు. మంగళవారం ఖమ్మంలోని జైలులో ఉన్న లక్కినేనిని కలిసి మాట్లాడారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు వేణు, అప్పారావు, జయరాం, పూల్ సింగ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న రవి

ఇల్లెందు: మండలంలోని జగదాంబా గుంపునకు చెందిన బండ హర్షవర్ధన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యం పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆ బాలుడికి ఏటీఎఫ్ సంఘం తరుపున రూ.40 వేల ఆర్థిక సాయం అందించారు. మంగళవారం ఏటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి ఆధ్వర్యంలో హర్షవర్ధన్ కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుంజ కృష్ణ, ఉండం నాగేందర్, కల్తీ రామకృష్ణ, గలిగే రాంబాబు, మోకాళ్ల మోహన్ రావు, కుంజ రవికుమార్ ఉన్నారు.

టాలెంట్ టెస్ట్ పేపర్ ఆవిష్కరణ


పేపర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యార్థులు పోటీ పరీక్షలలో తమ ప్రతిభను చాటాలని వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, ప్రతిభా పరీక్షలు ఉపయోగపడతాయని, విద్యార్థులు ప్రతిభా పరీక్షల ద్వారా మానసిక ధైర్యాన్ని పెంచుకుని ఒత్తిడిని తగ్గించుకోవాలని సీపీఐ నాయకులు దుర్గరాశి వెంకన్న, వాసిరెడ్డి మురళి, మైనార్టీ నాయకులు రజాక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి టాలెంట్ టెస్ట్ పేపర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ అన్నారు. స్వాతంత్రోద్యమంలో కూడా అలుపెరగని పోరాటం చేసినట్లు చెప్పారు. అనేక మంది విద్యార్థులను అత్యున్నత మేధావులుగా తీర్చిదిద్దిన ఏకైక సంఘం ఏఐఎస్‌ఎఫ్ అన్నారు. 10వ తరగతి విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

గిరిజన విద్యార్థి ప్రతిభ

కొత్తగూడెంఅర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో చుంచుపల్లి మండలం బదావత్ తండాకు చెందిన బదావత్ సాయి ప్రతిభ కనపర్చాడు. ఖమ్మం న్యూ విజన్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువిన సాయి జేఈఈ మెయిన్స్‌లో 94 పాయింట్లు సాధించి అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించాడు. ఏప్రిల్‌లో ర్యాంకింగ్ కేటాయించనున్నారు. మేలో జరగనున్న జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించినందుకు మంగళవారం పట్టణంలో సాయిని పలువురు అభినందించారు.

మిర్చి వ్యాపారులతో సమావేశం

ఇల్లెందు: ఇల్లెందు మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లను ముమ్మరం చేశారు. మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, సెక్రటరీ నరేష్‌కుమార్ మిర్చి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 17నుంచి టేకులపల్లి సబ్ యార్డు, ఇల్లెందు మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు జరిపేలా వ్యాపారులతో చర్చించారు. ఇల్లెందు మార్కెట్ పరిధిలో మిర్చి కొనుగోలు చేసే వ్యాపారులు ఇల్లెందు మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభించాలని విన్నవించారు. ప్రస్తుతం ఖమ్మం మార్కెట్‌లో క్వింటా రూ.14 వేలు ఉందని, రోజుకు లక్ష వరకు బస్తాలు ఖమ్మం మార్కెట్‌కు చేరుతున్నాయని చైర్మన్ రాంబాబు, సెక్రెటరీ నరేష్‌కుమార్ తెలిపా రు. అయితే ఇల్లెందులో కొనుగోళ్లకు ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. ఇల్లెందులో మిర్చి కొనుగోళ్లు జరిపితే ఈ ప్రాంతం నుంచి ఖమ్మం మార్కెట్‌కు తరలే మిర్చి బస్తాల సంఖ్య తగ్గుతుంది. రైతులు ఖమ్మం మార్కెట్‌కు వెళ్లి వారం రోజుల పాటు పడిగాపులు కాసే అవకాశం కూడా ఉండదు. ఇల్లెందు మార్కెట్ పరిధి నుంచి ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ మార్కెట్‌లకు తరలిపోతున్న మిర్చి బస్తాల సంఖ్యను మార్కెట్ సిబ్బంది ఆరా తీస్తున్నారు. బొమ్మనపల్లి, సుదిమళ్ల, ముచ్చర్ల, బయ్యారం చెక్ పోస్టుల్లో వాహనాలు, బస్తాల సంఖ్యను లెక్కిస్తున్నారు. ప్రతీరోజు 300 – 400 వరకు వెళ్తున్నట్లు గుర్తించారు.


వ్యాపారులతో సమావేశమైన చైర్మన్ రాంబాబు, సెక్రటరీ నరేష్‌కుమార్

కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీ



మాట్లాడుతున్న యాకూబ్‌షావలీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీ ఇంకెంతకాలమని టీయేసీఐ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్‌షావలీ ప్రశ్నించారు. సింగరేణి ప్రధాన కార్యాలయం, సింగరేణి ప్రధాన ఆస్పత్రి, బాబూ క్యాంప్ కాంట్రాక్టు కార్మికుల మస్టర్ అడ్డాల వద్ద మంగళవారం కాంట్రాక్టు కార్మికుల జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి పి.సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యాకూబ్‌శావలీ మాట్లాడారు. బొగ్గు పరిశ్రమలలో సుమారు 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నట్లు చెప్పారు. కోలిండియాలో 2021 నవంబర్‌లో జరిగిన ఒప్పందం ప్రకారం హైపవర్ వేతనాలు అమలు జరుగుతున్నాయని సింగరేణిలో మాత్రం అమలు కాకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచడంలో కాలయాపన చేస్తోందని విమర్శించారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల చట్టబద్ధ హక్కుల పట్ల నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు. ఇల్లెందులో వాటర్ సప్లై, బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. ఈనెల 16న కొత్తగూడెంలోని ఉర్దూ ఘర్‌లో జిల్లా మహాసభ జరుగుతుందని, కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎం.రాజశేఖర్, శంకర్, మరియ, రాధ, పుష్ప, వెంకటేశ్వర్లు, విజయ్, లలిత పాల్గొన్నారు.

ఈ సంఘానికి ఎన్నికల కోడ్ వర్తించదా..?

టేకులపల్లి: రాష్ట్రంలో రెండు వారాల క్రితం నుంచే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. నామినేషన్ల ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ఎన్నికల కోడ్‌ని పక్కాగా అమలు చేయాలనీ కలెక్టర్ అధికారులకు ఆదేశాలు కూడా ఇచ్చారు. కోడ్ ఉల్లంఘన జరగొద్దని పదేపదే కలెక్టర్ సమావేశాల్లో చెబుతూ వచ్చారు. ఇందలో భాగంగా టేకులపల్లి మండలంలో ఉన్న అన్ని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. వివిధ ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్‌లను తొలగించారు. కానీ కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ సాక్షాత్తు మండల విద్యాశాఖ కార్యాలయం గోడలపై ఉపాధ్యాయ సంఘం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని మాత్రం అధికారులు తొలగించలేదు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధ్యాయ సంఘానికి ఎన్నికల కోడ్ వర్తించదా..? దీనిపై పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులూ అభ్యంతరం వ్యక్తం జేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఎంఈఓ కార్యాలయం గోడపై ఉన్న ఫ్లెక్సీ

నేటి నుంచి వనదేవతల జాతర


మాట్లాడుతున్న ప్రధాన పూజారి కోటయ్య

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం శివారులోని అటవీ ప్రాంతంలో కొలువుదీరిన వన దేవతలు సమ్మక్క, సారలమ్మ చిన్న జాతర బుధవారం ప్రారంభమవుతుంది. మేడారానికి తీసిపోని విధంగా లక్షలాది భక్తుల సమక్షంలో రెండేళ్లకోసారి బొజ్జాయిగూడెం వనదేవతల గద్దెల వద్ద జాతర జరుగుతోంది. ఈ చిన్న జాతరను కూడా సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. జాతర విశేషాలను ప్రధాన పూజారి కొర్స కోటయ్య మంగళవారం వివరించారు. బుధవారం శాంతిపూజలు నిర్వహిస్తామని చెప్పారు. ఆ తరువాత వన దేవతలకు బోనం సమర్పించడంతో జాతర ప్రారంభమవుతుందని చెప్పారు. దీనికోసం గద్దెల ప్రాంగణాన్ని అలంకరించామని తెలిపారు. భక్తులు మూడు రోజులు జరగనున్న ఈ చిన్న జాతరకు హాజరై వనదేవతల దీవెనలు పొందాలని కోరారు. ఇదిలా ఉండగా చిన జాతరను పురస్కరించుకొని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కార్యదర్శి పాషా గద్దెల ప్రాంతంలో సిబ్బంది చేత పారిశుద్ధ్య పనులు చేయించారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం..



కొమ్ముగూడెంలో మాట్లాడుతున్న టీబీ సూపర్‌వైజర్ రఫేల్, పడమటనర్సాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జూలూరుపాడు: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని టీబీ సూపర్‌వైజర్ రఫేల్ అన్నారు. మంగళవారం జూలూరుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొమ్ముగూడెం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం పరిధిలో క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. దేశంలో క్షయ వ్యాధి నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో 100 రోజుల టీబీ నిక్షయ్ షివిర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్షయ వ్యాధిపై అందరూ అవగాహన పెంచుకొని నిర్మూలించడంలో సహకరించాలన్నారు. 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఆయాసం, అలసట, తేమడలో రక్తం పడటం, మెడ చుట్టూ, సంక, గజ్జలో గడ్డలు వంటివి క్షయ వ్యాధికి ప్రధాన లక్షణాలన్నారు. ఈ వ్యాధి గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. గతంలో క్షయ వ్యాధికి మందులు వాడిన వారు, కుటుంబ సభ్యులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, 60 సంవత్సరాలు పైబడినవారు ఈ వంద రోజుల నిక్షయ్ షివిర్ కార్యక్రమంలో ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నిర్ధారణ జరిగితే ప్రభుత్వం ఉచితంగా వ్యాధి తగ్గే వరకు మందులు, పోషకాహార నిమిత్తం మందులు వాడే కాలానికి ప్రతీనెల రూ.1000 అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎం.రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, ఏఎన్ఎం ఝాన్సీరాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులచే ప్రతిజ్ఞ..
కుష్టు వ్యాధి అవగాహన ప్రచారంలో భాగంగా మంగళవారం పడమటనర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులచే వైద్యసిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ.. చర్మంపై స్పర్శ కోల్పోయి మచ్చలు ఉండి వాటిని తాకినప్పుడు స్పర్శ లేకపోతే కుష్టు వ్యాధి లక్షణాలుగా గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభద్రమ్మ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.